సాక్షి మెదక్

ఆదివారం ; 9 ; ఏప్రిల్ ; 2023



మంజీరా కుంభమేళా 8లో

ఈ నెల 24వ తేదీ నుంచి 12రోజుల పాటు మంజీరా కుంభమేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సాధువులు రానున్నారు.




స్మార్ట్‌గా సైబర్ మోసం 8లో

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఓ అపరిచితుడు పంపిన టెలిగ్రామ్ మెసేజ్‌కు ఒకరు రూ.1.33 లక్షల నగదు పోగొట్టుకున్నాడు.



పోచమ్మకు బోనాలు 9లో

భేతాళస్వామి జాతరలో భాగంగా శనివారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. బోనాల సందర్భంగా శివసత్తులు నృత్యాలు చేశారు.



న్యూస్‌రీల్

రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ కోసం రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు శనివారంనాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. పట్టణ స్వర్ణకార సంఘం ప్రతినిధులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం దీక్షలో కూర్చున్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ప్రకటించేవరకు తాము దీక్షలు విరమించమని వారు స్పష్టం చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



మురళీయాదవ్‌ను సన్మానిస్తున్న లతరమేష్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ లతరమేష్ మురళీయాదవ్‌ను శాలువాతో సన్మానించారు.

మినీ గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని మినీ గురుకులాల్లోని ఖాళీ సీట్ల భర్తీకి (2023–24) అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్టు అదనపు కలెక్టర్ రమేశ్, రీజినల్ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మెదక్‌లోని మినీ గురుకులంలో 1, 2 ,3 తరగతుల్లో 33 సీట్లు, కౌడిపల్లిలో 1, 2 ,3, 4 తరగతుల్లో 60 సీట్లు ఖాళీగా ఉన్నాయి ఆయా పాఠశాలల్లో చేరేందుకు మెదక్, కౌడిపల్లి మండలాలకు చెందిన గిరిజన బాలికలకు మాత్రమే అర్హులు. వచ్చే నెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వచ్చే నెల 10వ తేదీన జిల్లా అదనపు కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన విద్యార్థినులను ఎంపిక చేస్తారు. మరిన్ని వివరాలకు 9948900450 (మెదక్), 8790641672 (కౌడిపల్లి) నంబర్లలో సంప్రదించాలి.

నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు

మెదక్ కలెక్టరేట్: నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ అంతర్జాతీయ విభాగం(ఎన్‌డీఎస్‌సీ) ఇంటర్నేషనల్ కౌశల్ మహోత్సవ్ పేరిట నైపుణ్యత గల అభ్యర్థుల కోసం ఆన్‌లైన్‌లో ఇంటర్నేషనల్ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తుందన్నారు. ప్రైమ్ హెల్త్‌కేర్ గ్రూప్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ హాస్పిటల్స్, ఎంసీ డోనాల్డ్స్, ఎమిరేట్ ట్రాన్స్‌పోర్ట్స్, క్యాపిటల్ నర్స్, ప్రైయిమ్స్, ఖాన్ సాహెబ్, డీపీ వరల్డ్, వర్ధమాన్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఐటీఐ, పాలిటెక్నిక్, ప్రొఫెషనల్ స్కిల్స్ ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లో సంప్రదించాలి.

అభివృద్ధి గ్రాఫిక్స్‌కే పరిమితం

మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధిని డిజిటల్‌లో గ్రాఫిక్స్‌లో చూపిస్తున్నారే తప్ప అభివృద్ధి చేయడం లేదని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విమర్శించారు. లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రథోత్సవంలో కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు.

చెరబట్టీ



మెదక్ శివారులోని ఓబట్టీ



- చెరువుల్లో మట్టితవ్వకాలు.. అక్రమంగా కలప రవాణా
- ఉచిత విద్యుత్ వాడకం
- ఇటుక బట్టీల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన

మెదక్‌జోన్: ఇటుక బట్టీల నిర్వహణకు సహజవనరులను చెరబట్టారు. ఏ అనుమతి లేకుండానే యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 800పైగా ఇటుకబట్టీలు కొనసాగుతున్నాయి. వీటి నిర్వహణలో కూడా అడుగడుగునా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. చెరువుల్లో మట్టి తరలింపు మొదలు, కలపరవాణా, ఉచిత విద్యుత్ వాడకం యథేచ్ఛగా సాగుతున్నా, ఇటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకొని బట్టీలు నిర్వహించే వారి సంఖ్య పదుల్లోనే ఉంది.

- మెదక్, చిన్నశంకరంపేట, రామాయంపేట, హవేళీఘనాపూర్, పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గం, నర్సాపూర్. తూప్రాన్, మనోహరబాద్, చేగుంట మండలాల్లో ఇటుకబట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది.
- వేసవిసీజన్ మొదలు కావడంతో ఇటుక వ్యాపారులు బట్టీలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు.
- బట్టీలకు అవసరమయ్యే విద్యుత్‌కు తప్పనిసరిగా డీడీ తీసి కనెక్షన్ తీసుకోవాలి. కానీ చాలాచోట్ల వ్యవసాయానికి సరఫరా అయ్యే ఉచిత విద్యుత్‌ను వాడుకుంటున్నారు.
- ఉచిత కరెంట్ వినియోగిస్తున్నా, అధికారులు ఆయా బట్టీలపై చేస్తున్న దాడులు నామమాత్రంగానే ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.
- ఇటుక కాల్చడానికి అవసరమ్యే కలప కూడా అక్రమంగానే రవాణా చేసుకుంటున్నారు. అయితే అటవీశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.
- ఇటుకలు తయారు చేయడానికి అవసరయ్యే మట్టిని చెరువుల నుంచి తరలిస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల నుంచి ఏ అనుమతి తీసుకోవడం లేదు.
- రైతుల నుంచి పొలాల నుంచి మట్టి తవ్వాలన్న అనుమతి తప్పనిసరి. ఆ నిబంధనా పాటించడం లేదు.

పది బట్టీలకే కరెంట్ కనెక్షన్

మెదక్, చిన్నశంకరంపేట, హవేళీఘనాపూర్ మండలాల పరిధిలో 50కిపైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. కానీ కేవలం 10 బట్టీలకు మాత్రమే విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. మిగతావారు అనుమతి తీసుకోకుంటే విజిలెన్స్ అధికారులతో దాడులు చేయించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌బాబు, ఏడీ ట్రాన్స్‌కో, మెదక్

అంబేడ్కర్ అందరివాడు



వరిగుంతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏ ఒక్కవర్గానికి చెందినవాడు కాదని, అందరివాడని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వరిగుంతంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రచారకార్యదర్శి ఆకుల పెంటయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. భారత రాజ్యాంగ వ్యవస్థను ప్రపంచ దేశాలకు దిక్సూచిగా మార్చిన ఘనత అంబేడ్కర్‌దే అని కొనియాడారు. స్త్రీ, పురుష భేదం లేకుండా ప్రతిఒక్కరికి అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించాలన్న లక్ష్యం, విద్య అందించాలన్న ఆశయంతో భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో కొల్చారం ఎంపీపీ మంజుల జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, సర్పంచ్ ఉమారాణి, నేతలు మల్లారెడ్డి, లలిత, ప్రభాకర్, ఆనంద్, ప్రొఫెసర్ హుస్సేన్, శంకర్, ప్రభాకర్, సంజీవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పీఎం దిష్టిబొమ్మ దహనం



పీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నేతలు

మెదక్‌జోన్: దేశంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం పేర్కొన్నారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనను వ్యతిరేకిస్తూ పట్టణంలోని రాందాస్‌చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసి, దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ తాజాగా సింగరేణిలో మరోసారి బొగ్గుగనుల వేలానికి కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటినీ ఒకొక్కటిగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బస్వరజ్, సంతోష్, నాయకులు ప్రవీణ్, జగన్ అజయ్, లచ్చాగౌడ్, షౌకత్‌అలీ పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడాలి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పదోతరగతి పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. కలెక్టర్ రాజర్షిషా మనోహరాబాద్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు చేపట్టాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు గణితం పరీక్షకు 10,703 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 23మంది గైర్హాజరయ్యారు. నర్సాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ రమేష్, చేగుంట, తూప్రాన్, మెదక్, రామాయంపేట, నిజాంపేట, వెల్దుర్తి, శివ్వంపేట,పెద్ద శంకరంపేట్ మండలాల్లో డీఈఓ, ఆర్డీఓ తనిఖీలు చేశారు.

రన్‌ఫర్ జీసస్



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువత

మెదక్‌జోన్: మెదక్ సీఎస్ఐ చర్చి కాంపౌండ్ ఆధ్వర్యంలో ప్రజలు బాగుండాలనే సంకల్పంతో రన్ ఫర్ జీసస్ నినాదంతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శనివారం ర్యాలీ నిర్వహించారు. వెయ్యి మంది యువకులు రన్‌ఫర్ జీసస్ అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. అనంతరం చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జ్ శాంతయ్య మాట్లాడుతూ.. గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రజలు శాంతియుత మార్గంలో నడవాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు.

పోరాటాలతోనే హక్కుల సాధన



సిద్దిపేట రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు

సిద్దిపేటఅర్బన్: ఐక్య ఉద్యమాలతో హక్కుల సాధన సాధ్యమవుతుందని, రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసేవరకు పోరాటం చేస్తామని రెడ్డి జేఏసీ నాయకులు అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో ఓ ఫంక్షన్ హాల్‌లో జక్కిరెడ్డి నరేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు పాల్గొని మాట్లాడారు. రెడ్డి కులస్తులలో వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారిని, పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. నాలుగేళ్లు దాటినా నాయకులు ఇచ్చిన హామీలు అమలు కాలేదని అన్నారు. రెడ్డి ఐక్యవేదిక, రెడ్డి జేఏసీ, రెడ్డి జాగృతి, రెడ్డి జేఏసీ–2, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రెడ్డి తదితర సంఘాలతో కలిసి కార్పొరేషన్ సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, వసంతరెడ్డి, పద్మారెడ్డి, మందపల్లి మహిపాల్‌రెడ్డి, పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, ఉమాదేవి, స్వరూప, సంజీవ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వంశిధర్‌రెడ్డి, బాపురెడ్డి, యాళ్ల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షను జయప్రదం చేయండి

హుస్నాబాద్‌రూరల్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 11న రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టే నిరసన దీక్షను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శనివారం పొట్లపల్లి గ్రామంలో పోస్టర్ ఆవిష్కరించారు. హక్కుల సాధనకు చేపట్టిన దీక్షకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కర్ర రవీందర్ రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): కార్యకర్తలు భయపడవద్దని, వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 15వ తేదీన కౌడిపల్లిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే తన ఇంట్లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. మండల బీఆర్‌ఎస్‌అధ్యక్షుడు సార రామాగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి ప్రతిగ్రామం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలను తరలించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మొహం చూస్తే జనం ఓట్లు వేయరని, సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయన్నారు. కాగా పలువురు సర్పంచ్‌లు బిల్లులు రాలేదని చెప్పడంతో ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే సూచించారు. సోషల్ మీడియాను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని, చేసిన పనులే గుర్తింపు తెస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవిత అమర్‌సింగ్, ఆత్మ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, నాయకులు నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకున్నది కాంగ్రెస్సే



రైతు నాగరాజు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ ప్రతినిధులు

మెదక్ రూరల్: రైతుకుటుంబాలను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్‌దేనని, ఆ పార్టీ పీసీసీ ప్రతినిధులు చౌదరి సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ అన్నారు. శనివారం హవేళిఘణాపూర్ మండలం జక్కన్నపేట గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు నాగరాజు కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రతినిధుల బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు నెలల వ్యవధిలో నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు.ప్రతి రైతు బాధిత కుటుంబానికి కాంగ్రెస్ తరఫున ఆర్థిక సాయం అందజేశామని, నాగరాజు కుటుంబానికి సైతం అదే తరహాలో సాయం ప్రకటించామన్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన రైతు ఆత్మహత్యలపై విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్, రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ హఫీజ్ మొల్సాబ్, రమేష్ రెడ్డి, జక్కన్నపేట్ మాజీ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ గౌడ్, మల్లేశం, వెంకట్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రేమికుడు

- చెత్త రీసైక్లింగ్ చేస్తూ ఇంట్లోనే వర్మీ కంపోస్ట్ తయారీ
- స్వచ్ఛబడిలో అవగాహన కార్యక్రమాలు
- శుభదినాల్లోనూ స్పెషల్ ప్రోగ్రామ్స్



మొక్కలకు నీళ్లు పోస్తున్న డాక్టర్ స్వామి

సండే స్పెషల్

సాక్షి, సిద్దిపేట: పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాడు సిద్దిపేట పట్టణానికి చెందిన దేవులపల్లి నరసింహస్వామి. వృత్తిరీత్యా దంత వైద్యుడైనా, పర్యావరణ రక్షణ, సేంద్రియ పంటలు సాగు చేస్తూ అందరికీ అవగాహన కల్పిస్తున్నాడు.

ఆ ఘటనతో..

సిద్దిపేట డిగ్రీ కళాశాలలో ఓ అధ్యాపకుడు ఇంట్లో చెత్తను దహనం చేయగా, అందులో ఉన్న షేవింగ్ క్రీం స్ప్రే బాటిల్ పేలి మంటల దాటికి ముఖం కాలిపోయింది. గాయపడిన వ్యక్తిని పరామర్శించేందుకు వెళ్లిన డాక్టర్ స్వామికి చెత్త రీయూజ్‌పై ఆలోచన తట్టింది. ఇదే సమయంలో మంత్రి హరీశ్‌రావు చొరవతో పట్టణంలో ఇంటింటా వేర్వేరుగా తడి, పొడి చెత్త సేకరణ ప్రారంభించారు. స్వచ్ఛబడి ఏర్పాటు చేసి ఇంట్లో వెలువడే చెత్తతో సేంద్రియ ఎరువు ఎలా తయారు చేయవచ్చో నేర్పించారు. మన చెత్త...మన బాధ్యతగా ముందుగుసాగుతున్నాడు డాక్టర్ స్వామి.

రెండేళ్లుగా ఇంట్లోనే ...

స్వచ్ఛబడిలో వర్మీ కంపోస్ట్‌పై అవగాహన పెంచుకున్నాడు. అప్పటి నుంచి ఇంట్లో చెత్తను బయట వేయకుండా బాక్స్‌లో వేయాలని భార్య శ్రీదేవికి సూచించాడు. అలా ఇంట్లోనే కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్నారు. ఇంటిపై ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మిద్దెతోటలో సేంద్రియ ఎరువును వినియోగిస్తున్నారు. వారంలో నాలుగు నుంచి ఐదు రోజులు మిద్దెతోటలో పండిన కాయగూరలనే తింటున్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు అందరూ కృషి చేయాలి. నా కూతురు వివాహ వేడుకలో పెళ్లి కార్డు మొదలు అన్నీ ప్లాస్టిక్ రహితమే. మంత్రి హరీశ్‌రావు స్వచ్ఛ బడి ఏర్పాటుతో కంపోస్ట్ ఎరువు తయారీ ఎలా చేయాలో నేర్చుకుంటున్నారు. సేంద్రియ ఎరువుతో పండించిన కాయగూరలే తింటున్నాం. ఆరేళ్ల క్రితం ఇంటిపై మిద్దె తోటను ఏర్పాటు చేసుకున్నాం.

– డాక్టర్ డీఎస్ స్వామి

రోజుకు రెండు గంటలు స్వచ్ఛ బడిలో..



డాక్టర్ స్వామి సిద్దిపేట స్వచ్ఛబడిలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. ప్రతీ రోజు బడిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అక్కడ పనిచేస్తాడు. సేంద్రియ ఎరువు తయారీ, మొక్కల పెంపకం, కొత్త మొక్కలు నాటడం, కలుపు తీయడం చేస్తున్నారు. వర్మీ కంపోస్ట్‌పై స్వచ్ఛబడిలో శిక్షణ ఇస్తున్నారు. తన సొంత డబ్బులతో కంపోస్ట్ బకెట్‌ను అందజేస్తున్నాడు. సేంద్రియ ఎరువులను ప్రోత్సహించేందుకు రైతు శ్రీనివాస్ ఎకరానికి సరిపడా సేంద్రియ ఎరువును కొనుగోలు చేసి అందించాడు. రెండు ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను తయారు చేసి అందించారు.

విత్తనాలతో వివాహ పత్రిక



వెడ్డింగ్ కార్డులు డిఫరెంట్‌గా ఉండాలని కొత్త కొత్త డిజైన్స్ చేయించుకుంటున్నారు చాలామంది. కానీ డాక్టర్ స్వామి పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని తన కూతురు పెళ్లికి స్పెషల్ వెడ్డింగ్ కార్డ్ డిజైన్ చేయించాడు. ఈ కార్డును నీళ్లలో తడిపి, మట్టిలో పెడితే అందులో ఉన్న తులసి, పూలు, కూరగాయల విత్తనాలు మొలకెత్తుతాయి. గ్లాసులు, ప్లేట్‌లను మొక్కజొన్న పొడితో తయారు చేయించి, పెళ్లిలో ప్లాస్టిక్‌ను వినియోగించకుండా వివాహ వేడుక నిర్వహించాడు. వివాహానికి వచ్చిన వారికి సీడ్ బాల్స్‌ను గిఫ్ట్‌గా అందించారు. ఏదైనా శుభకార్యానికి వెళితే తన వెంట తెచ్చుకున్న స్టీల్ ప్లేట్‌లో వడ్డించుకుని భోజనం చేస్తాడు. ఇలా ప్లాస్టిక్ వినియోగించకుండా సేంద్రియ ఎరువులను ప్రోత్సహిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

క్లుప్తంగా

అకస్మాత్తుగా ఎద్దు మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అకస్మాత్తుగా ఓ ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అంకెనపల్లి గ్రామంలో జరిగింది. శనివారం గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు కొల్కూర్ మణెయ్య తన ఎద్దును శుక్రవారం రాత్రి గ్రామ శివారులోని తన పొలంలో కట్టేశాడు. శనివారం వెళ్లి చూడగా మృతి చెంది కనిపించింది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. తనను ఆదుకోవాలని రైతు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. విషయం తెలుసుకున్న సంఘసేవకుడు తెర్పోల్ సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని రైతుకు ధైర్యం చెప్పి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశాడు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ


ఆలయంలోని హుండీని పగులగొట్టిన దుండగులు

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయలో హుండీని దుండగులు పగులగొట్టి అందులోని డబ్బును ఎత్తుకెళ్లారు. శనివారం గౌడ సంఘం అధ్యక్షుడు ముంజ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా ఆలయంలో గతంలో రెండో సార్లు చోరీ జరిగినట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు.

బాలవికాస వాటర్ ప్లాంట్‌లో ..

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం గాంధీనగర్ బాలవికాస వాటర్ ప్లాంట్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ప్లాంట్‌లోని బీరువాను పగలగొట్టి రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. చోరీపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సర్పంచ్ దుండ్ర భారతి తెలిపారు. నెల క్రితం చౌటపల్లి స్టేజీవద్ద హోటల్‌లో కూడా చోరీ జరిగిందని, అలాగే గాంధీనగర్‌లోని ఓ కిరాణం షాపులో వృద్ధురాలిని మోసం చేసి రూ.2 వేల విలువగల సామాను ఎత్తుకెళ్లారు. అక్కన్నపేట రోడ్డులోని గ్రామాల్లో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. చెరువు గట్టు మందుబాబులకు అడ్డగా మారడంతో మద్యం తాగిని తర్వాతే దొంగతనాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

ఇద్దరి అరెస్ట్

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లోని గురుకుల పాఠశాల విద్యార్థిని ఆడబిడ్డను ప్రసవించిన కేసులో ఇద్దరు బాలురును శనివారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెంకటరెడ్డి తెలిపారు. గత నెల 24వ తేదీన పాఠశాల బాత్‌రూమ్‌లో ఓ విద్యార్థిని ఆడబిడ్డను ప్రసవించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసి సంగారెడ్డిలోని జువైనల్ కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

పరిశ్రమలో అగ్నిప్రమాదం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం కర్దనూరు గ్రామంలోని ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం జరిగింది. శనివారం రాత్రి పరిశ్రమ బ్లాక్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు సమాచారం.

మంజీర కుంభమేళా

- ఈనెల 24 నుంచి 12 రోజుల పాటు నిర్వహణ
- దక్షిణ భారత దేశంలోనే ఏకైక కుంభమేళా
- వివిధ ప్రాంతాల నుంచి సాధువుల రాక
- పుణ్యస్నానాలు ఆచరించనున్న వివిధ రాష్ట్రాల భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం


న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్ వద్ద మంజీర నది

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : మంజీర కుంభ మేళా నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. గరుడ గంగ పేరుతో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్, హుమ్నాపూర్ శివారుల్లోని పంచవటి ఆలయ సమీపంలో మంజీరా నదిలో ఈ కుంభమేళా నిర్వహించనున్నారు.

- సూర్యుడు మేషరాశిలో ప్రవేశిస్తున్న శుభసమయాన ఈ మేళా ప్రారంభమవుతుంది. ఈనెల 24 నుంచి 12 రోజుల పాటు కొనసాగనుంది.
- ఈ కుంభమేళాకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
- స్నానాలు చేసే భక్తులకు అవసరమైన స్నాన ఘట్టాలు, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, తాగునీటి సౌకర్యం, భోజన వసతి, వాహనాల పార్కింగ్ స్థలాలు, బారికేడ్లు, రోడ్ల మరమ్మతులు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించారు.
- రాష్ట్ర ఆర్థిక, వైద్యరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు ఆదేశాల మేరకు కలెక్టర్ శరత్, ఎస్పీ రమణకుమార్ ఈ కుంభమేళా ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

నాలుగేళ్లకు ఒకసారి..

మంజీర నదికి కుంభమేళా నిర్వహించడం 2010 నుంచి ప్రారంభమైంది. ప్రతీ నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఈ కుంభమేళా నిర్వహిస్తారు.


- చివరి సారిగా 2018 ఏప్రిల్ 14 నుంచి 2018 ఏప్రిల్ 25 వరకు కొనసాగింది. ఈసారి కూడా 12 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కుంభమేళాకు వివిధ పుణ్యక్షేత్రాల నుంచి సాధువులు తరలివస్తుంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.
- ఈ సాధువులు నదికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుంభమేళాను ప్రారంభిస్తారు. అనంతరం భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు.

భారీగా భక్తుల రాక

ఈ కుంభమేళాకు తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు, కర్ణాటకలో బీదర్, కలబురిగి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు.

- సమీప మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా ఈ కుంభమేళాకు వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు.
- కుంభమేళా సమయంలో హరహర మహాదేవ అంటూ భక్తుల నినాదాలతో ఈ ప్రాంతం మారుమోగుతుంది. పెద్దసంఖ్యలో వచ్చే సాధువులు, భక్తులతో ఈ ప్రాంతం పూర్తిగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది.

ప్రభుత్వ సహకారంతో..




కుంభమేళాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆశ్రమ తరపున, ప్రభుత్వ సహకారంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. గరుడ గంగా కుంభమేళాను పురస్కరించుకుని మంజీర నదిలో స్నానాలు ఆచరిస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది. ఈసారి 200 పైగా నాగ సాధువులు వస్తున్నారు.

– కాశీనాథ్ బాబా, పంచవటి క్షేత్రం, పీఠాధిపతి

భారీ మొత్తంలో విద్యుత్ బిల్లు

వస్త్ర దుకాణ యజమానికి రూ.90,163 వచ్చిన వైనం



దుకాణదారుడికి వచ్చిన విద్యుత్ బిల్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓ సాధారణ వస్త్ర దుకాణం విద్యుత్ బిల్లు ఎంత వస్తుంది...మహా అయితే రెండో, మూడో, లేదంటే పది వేలో వస్తుంది, కానీ సిద్దిపేట పట్టణంలోని ఓ వస్త్ర దుకాణ యజమానికి ఏకంగా రూ.90163 వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు వైపు ఉన్న ఓ వస్త్ర దుకాణానికి నెల విద్యుత్ బిల్లు భారీ మొత్తంలో వచ్చింది. ఈనెల 7వ తేదీన విద్యుత్ బిల్లు రావడంతో దుకాణ నిర్వాహకులు చూసి బెంబేలెత్తారు. గతనెల 14 నుంచి ఈ నెల 7వరకు విద్యుత్ రీడింగ్ తీయగా 8169 యూనిట్లు వినియోగం జరిగినట్లు, అందుకుగాను రూ.90,163 బిల్లు వచ్చింది. ప్రతీ నెల కేవలం తమకు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు మాత్రమే వచ్చేదని, ఇలా రూ.90 వేలు రాలేదన్నాడు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించగా రీడింగ్ మిషన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో ఈ విధంగా అధిక బిల్లు వచ్చిందని, ఈ సమస్యను పరిష్కరించామని వివరణ ఇచ్చార

స్మార్ట్‌గా.. సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ యూట్యూబ్ వీడియోస్ లైక్ చేసే జాబ్ ఉందంటూ అపరిచితుడు పంపిన టెలిగ్రామ్‌కు మేసేజ్‌కు స్పందించిన బాధితుడు పెద్దమొత్తంలో నగదు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామ సమీపంలోని లైఫ్‌స్టైల్ లో నివాసం ఉండే బ్యాంక్ ఉద్యోగి వంశీధర్‌రెడ్డి కి గతనెల 19వ తేదీన ఆన్‌లైన్ యూట్యూబ్ లైక్స్ కొట్టే ఉద్యోగం ఉందని టెలిగ్రామ్‌లో మెసేజ్ వచ్చింది. ముందుగా బాధితుడు తన వివరాలను నమోదు చేయగా, ఆన్‌లైన్ ఇచ్చిన టాస్క్ చేయగా అతడికి రూ.150, రూ.800 ఇచ్చారు. అనంతరం క్రిప్టో కరెన్సీ అకౌంట్ క్రియేట్ చేసుకోమని చెప్పగా బాధితుడు అలాగే చేశాడు.

దీంతో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చని, పెట్టిన పెట్టుబడికి 30 శాతం కమీషన్ ఇస్తామని నమ్మబలికారు. ముందుగా రూ.7 వేలు పెట్టుబడి పెట్టగా రూ.9100 క్రియేట్ చేసిన అకౌంట్ లో చూపించారు. తరువాత రూ.30 వేలు వేయగా రూ.39 వేలు చూపించారు. ఇలా నగదు పెడుతూ పోగా రూ. 1.33 లక్షల వరకు బాధితుడు పెట్టాడు. పెట్టిన డబ్బు రావాలంటే రూ.3 లక్షలు ఇన్వెస్ట్ చేయాలని చెప్పడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించాడు. జరిగిన ఘటనపై సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశాడు. అలాగే శనివారం బీడీఎల్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిన్నారం(సంగారెడ్డి): వాట్సాప్‌లో పంపిన వీడియో లింక్ ఓపెన్ చేసి లైక్ చేస్తే బోనస్ ఇస్తామని సైబర్ మోసగాళ్లు మోసానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన అవిరాల్ సింగ్ తోమార్ వాట్స్‌ప్ ఓ లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి వీడియో లైక్ చేస్తే రూ.వెయ్యికి రూ.1600 బోనస్ ఇస్తామని సైబర్ నేరస్తులు నమ్మబలికారు. దీంతో బాధితుడు విడతల వారీగా రూ.1.26 లక్షలు పంపి మోసపోయాడు. అలాగే గుమ్మడిదలకు చెందిన చింత వెంకట రామయ్య ఫోన్ రీచార్జి చేశాడు. రీచార్జి కాకపోవడంతో కస్టమర్ కేర్‌కు ఫోన్ చేశాడు. వారు పంపిన లింక్ ఓపెన్ చేయడంతో అతడి ఖాతా నుంచి రూ.28,122 కాజేశారు. అదే విధంగా దోమడుగకు చెందిన పన్నీర్ సెల్వం తన కూతురి పాస్ పోర్ట్ ను చెన్నైకి కొరియర్ పోస్ట్ చేశాడు. అది వెల్లకపోవడంతో గూగుల్ ట్రాకింగ్ చేయగా ట్రాకింగ్ రూ.2లు పంపాలని సూచించింది. అలా పంపడంతో అతడి ఖాతా నుంచి రూ.97,085 డెబిట్ అయ్యాయి. పోలీసు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఓ అబ్బాయి ఫోన్‌లో వేధించడంతో మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకొంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం పట్టణానికి చెందిన ఓ అబ్బాయి శనివారం ఫోన్‌చేసి మాట్లాడిన తర్వాత ఉరివేసుకుంది. ఇంటికి వచ్చిన తండ్రికి కూతురు ఉరివేసుకొని కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అబ్బాయి వేధించడంతో తన కూతురు ఆత్మహత్య చేసుకొందని బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

సిద్దిపేటకమాన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నకోడూర్ మండలం రామంచ గ్రామానికి చెందిన బోదాసు రాములు (35) భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా పని దొరకకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక సిద్దిపేట ఇందిరమ్మకాలనీలోని వేణుగోపాల్ పొలంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: మండలంలోని మక్తమైలారంలో తాటిచెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కొండపాక విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం గౌడ సంఘం నాయకులతో కలిసి ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మక్తమైలారం సర్పంచ్ కనకయ్య, అదే గ్రామానికి చెందిన రామలింగారెడ్డితో పాటు మరికొంతమంది కలిసి తాటిచెట్లను తొలగించారని ఆరోపించారు. తాటిచెట్లతో ఉపాధి పొందుతున్న గౌడ కులస్తులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్య తీసుకొని, గౌడ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం నాయకులు రవీందర్‌గౌడ్, అంజయ్యగౌడ్, కృష్ణగౌడ్, సత్యనారాయణగౌడ్, నరేష్‌గౌడ్, బాల్‌రాజుగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, బాబుగౌడ్, వెంకట్‌గౌడ్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం

- కట్నం, బైక్ ముందే ఇవ్వాలని యువకుడి పరతు
- భవనం పై నుంచి దూకడంతో తీవ్రగాయాలు, పరిస్థితి విషమం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: కట్నం, బైక్ ముందే కావాలని, ఇస్తేగాని పెళ్లి చేసుకునేది లేదని ఓ యువకుడు ఫోన్‌లో యువతిని తిడుతూ అడగటంతో మనస్తాపం చెందిన యువతి రెండో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యయు యత్నించింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. యువతి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణంలోని నాయికోటి బస్తీకి చెందిన జంగయ్య కూతురు యామినికి పటాన్‌చెరు మండలం భానూర్ కంచర్ల గూడెంకు చెందిన జంగయ్య అక్క లక్ష్మి కుమారుడు చిన్నోల శంకర్‌తో మార్చి 26వ తేదీన నిశ్చితార్థం జరిగింది. ఆ సమయంలో రూ.50 లక్షలు కట్నం భూమి అమ్మిన తర్వాత ఇస్తామని చెప్పడంతో శంకర్ కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. నిశ్చితార్థం జరిగిన మార్నాడే కట్నంతో పాటు బైక్ ముందే కావాలని యువతికి ఫోన్ చేసి ఇష్టం వచ్చినట్లు మాట్లాడి అడిగాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు శుక్రవారం యువకుడి ఇంటికి వెళ్లి మాట్లాడేందుకు వెళ్లడంతో తనకు పెళ్లి అవసరం లేదంటూ నిశ్చితార్థం సమయంలో పెట్టిన రింగ్ తీసి పడేశాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు మళ్లీ మాట్లాడుదామని చెప్పి ఇంటికి వచ్చారు. దీంతో మనస్తాపం చెందిన యువతి భవనం రెండో అంతస్తు పైనుంచి దూకడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు వెంటనే యామినిని చికిత్స కోసం పట్టణంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషయంగా ఉందని వైద్యులు తెలిపారు. కట్నకానుకల విషయంలో శంకర్, అతడి కుటుంబ సభ్యులు వేధించడంవల్లే తమ కూతురు ఆత్మహత్యకు యత్నించిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

- ఒంటినిండా గాయాలు
- దుర్వాసన రావడంతో గుర్తించిన స్థానికులు
- మార్చురీకి తరలించిన పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేరుగు గ్రామశివారులో అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం శనివారం లభ్యమవడం స్థానికంగా కలకలం రేపింది. గ్రామ శివారులోని పెట్రోలు పంపు సమీపంలోగల నరుకుల ఆంజనేయులు పొలంలో శరీరంపై దుస్తులు లేకుండా కనిపించింది. మృతదేహంపై ఒంటి నిండా దెబ్బలతో కూడిన గాయాలు, రక్తపు మరకలు, ముఖం నల్లగా మారిపోవడంతో గుర్తుపట్టలేని విధంగా ఉంది. సమీపంలో పత్తిచేనులో మృతుడి షర్ట్, ప్యాంటు, లోదుస్తువులు చింపి పారేసినట్టు ఉండటం చేర్యాల– కడవేర్గు రహదారికి పక్కనే గల ఫాంహౌస్, పెట్రోలు పంప్‌కు దగ్గరలో మృతదేహం లభ్యమవడం పలు అనుమానాలకు దారితీసింది. మృతదేహం స్థానికుడిదా లేదా వేరే ప్రాంతానికి చెందినవాడా, ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తెచ్చి కాల్చే ప్రయత్నం చేశారా అన్నది మిస్టరీగా మారింది. భూ తగాదా, ఆస్తి పంపకాలు, అక్రమ సంబంధమో హత్యకు దారి తీసి ఉంటుందా అని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం మధ్యాహ్నం దుర్వాసన వస్తుండటంతో గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పరిసరాలను గాలించారు. మృతుడి దుస్తుల్లో ఆనవాలు లేకపోవడంతో మృతదేహాన్ని చేర్యాల మార్చురీకి తరలించారు. పొలంలో మృతదేహం ఉందని తెలిసిన గ్రామస్తులు అధిక సంఖ్యలో ఘటన స్థలానికి చేరుకున్నారు.

ఆస్పత్రిలో రోగిపై వైద్య సిబ్బంది దాడి


గాయం చూపుతున్న హన్మానాయక్

నారాయణఖేడ్: వైద్యం కోసం వెళ్లిన్న రోగిపై వైద్యుడు, సిబ్బంది చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ తండాకు చెందిన హన్మానాయక్ కాలికి గాయమవడంతో శనివారం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ ఓపీ చీటి రాసివ్వడంతో వరుసలో నిల్చున్నాడు. ఎంతకీ తనవంతు రాకపోవడంతో వైద్యుడిని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైద్యుడు, కొంతమంది సిబ్బంది అతడిని ఓ గదిలోకి తీసుకెళ్లి కర్రతో తీవ్రంగా కొట్టడంతో గాయపడ్డాడు. ఒంటిపైన గాయాలను విలేకర్లకు చూపించాడు. ఈ విషయంపై జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డిని విలేకర్లు వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి నిజమని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్‌కు చెందిన నవీన్ కుమార్ తన ద్విచక్రవాహనంపై తల్లి వెంకటలక్ష్మి(67), కుమారుడు దినేష్(9)తో కలసి ముషీరాబాద్ నుంచి సంగారెడ్డి రాజంపేటలో ఉండే సోదరి చంద్రకళ ఇంటికి శుక్రవారం బయలు దేరారు. ఈ క్రమంలో పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ శివారులోకి రాగానే వెనుక కూర్చున్న వెంకటలక్ష్మి ప్రమదవశాత్తు వాహనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

సిద్దిపేటకమాన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు శనివారం మృతి చెందాడు. వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా చొప్పదండి గ్రామానికి చెందిన మాకుల ఈశ్వరయ్య (78) సిద్దిపేట పట్టణం భారత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి మానసిక స్థితి సరిగా లేక అకస్మాత్తుగా అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లి వస్తుంటాడు. ఈనెల 7వ తేదీన పట్టణంలోని ఓ ప్రాంతంలో అపస్మారకస్థితిలో పడిఉండటాన్ని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి రిఫెర్ చేయడంతో అక్కడికి తరలించారు.

గుండెపోటుతో రైతు..

కొల్చారం(నర్సాపూర్): పొలం పనులు చేస్తూ గుండెపోటుతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో శనివారం జరిగింది. మృతుడి భార్య కంది నర్సమ్మ, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మృతుడు కంది లక్ష్మీనారాయణ (52) పొలంలో పనిచేసేందుకు ఉదయం భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. దీంతో మృతుడి భార్య ఫోన్‌చేసి కుమారుడికి సమాచారం ఇచ్చింది. చికిత్స నిమిత్తం లక్ష్మీనారాయణను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.


లక్ష్మీనారాయణ (ఫైల్)

వాహన తనిఖీలు

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సీపూర్ చౌరస్తా వద్ద సీఐ మున్నూరు కృష్ణ వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని 15 వాహన దారులకు జరిమానా విధించారు. పెండింగ్ చలానాల నుంచి రూ.11565 వసూలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా సరైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. వాహనాలకు నంబర్ ప్లేట్ స్పష్టంగా కనిపించేటట్టు ఉండాలని, తప్పుడు నంబర్ ప్లేటుతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

పులి సంచారం.. ప్రజల భయాందోళన!

- ఆనవాళ్లు పరిశీలించిన అధికారులు
- పులి కాదని వెల్లడి


ఆనవాళ్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): పులి సంచారం పుకారుతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పలువురు హైదరాబాద్ వెళ్లి వాహనంలో తిరిగి వస్తున్నారు. బోరేగావ్ గ్రామ శివారులో అర్ధరాత్రి 2 గంటల సమయంలో పులి రోడ్డు దాటి పొలంలోకి ప్రవేశించిందని విస్తృతంగా ప్రచారం జరిగింది. అప్పటి నుంచి గ్రామ ప్రజలు భయాందోళన గురై తెల్లవారుజామున వరకు జాగారం చేశారు. అదే విధంగా పంట పొలాల వద్ద కావలి ఉన్నవారికి తమ కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో భయం భయంతో తిరిగి ఇంటికి వచ్చారు. గ్రామస్తులు పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. శనివారం ఉదయం ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి, అటవీశాఖ అధికారి ఇనాయత్ అలీ వచ్చి ఆనవాళ్లు పరిశీలించారు. ఆధారాలు సేకరించారు. పులి సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవని హైనా లేదా అడవి కుక్క సంచరించి ఉండవచ్చని వెల్లడించారు. గ్రామస్తులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి


రాజిరెడ్డి మృతదేహం (ఇన్‌సెట్‌లో) బోల్తా పడ్డ ట్రాక్టర్

చిన్నకోదూరు(సిద్దిపేట): పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన కోరెపు రాజిరెడ్డి(58)కి భార్య లక్ష్మి, కుమారుడు సంతోష్ రెడ్డి ఉన్నారు. శనివారం మధ్యాహ్నం పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో రాజిరెడ్డి ట్రాక్టర్ కింద పడిపోవడం సమీప రైతులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు పొలానికి చేరుకుని రాజిరెడ్డి వెంటనే సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజిరెడ్డి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడి కుమారుడు సంతోష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి


మద్దూరు(హుస్నాబాద్): అనుమతులు లేకుండా జేసీబీతో మట్టిని తవ్వుతున్న దృశ్యం

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రామ చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మరుమాముల గ్రామంలోని ఊర చెరువులోని మట్టిని రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నాడు. చెరువు మట్టిని తరలించాలంటే తహసీల్దార్, నీటి పారుదల శాఖ, గ్రామ పంచాయతీ అనుమతులు తప్పనిసరి. అయితే ఇవేమీ లేకుండానే కాంట్రాక్టర్ మట్టిని తరలిస్తున్నాడు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారి సంతోష్‌ను వివరణ కోరగా సదరు కాంట్రాక్టర్ తరలింపు అనుమతి తీసుకోలేదని, మట్టి తరలింపును నిలివేయాలని తహసీల్దార్‌కు సూచించమని తెలిపారు.

మర్కూక్(గజ్వేల్): చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పాతూరు సర్పంచ్ అరుణ నర్సింహులు, గ్రామస్తులు మండిపడుతున్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పాతూరు గ్రామంలో బ్రాహ్మణ చెరువు, బొమ్మలకుంటల్లో రెండు నెలలుగా అర్ధరాత్రి పాములపర్తి గ్రామానికి నాగేందర్, మహేశ్, మహిపాల్‌రెడ్డి వాహనాల్లో మట్టిని అక్రమ తరలిస్తున్నారన్నారు. వాహనాలను గ్రామస్తులు అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్‌కు ఫోన్‌లో సమాచారం అందించడానికి ప్రయత్నం చేస్తే స్పందించలేదని, సెలవులో ఉండటంతో కార్యాలయానికి వెళ్లలేదని, సోమవారం ఫిర్యాదు చేస్తామన్నారు. మట్టిని తరలిస్తున్నవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసినివారిలో గ్రామస్తులు రామచంద్రం, కనకయ్య, నర్సింలు, శ్రీను తదితరులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని శనివారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాసాయిపేట మండలం రామంతపూర్ అటవీ ప్రాంతం నుంచి టిప్పర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్‌ఐ ధన్‌సింగ్ మట్టని తరలిస్తున్న ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ తెలిపారు.